# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

18-7-2023




అవినీతిపరులంతా

## బెంగళూరులో దుకాణం తెరిచారు

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 18)**

కేంద్రంలో అధికారమే లక్ష్యంగా విపక్షాలన్నీ ఒక్కటవుతున్నాయి. మూడోసారి బీజేపీ గెలుపును అడ్డుకోవడానికి వ్యూహాలు పన్నుతున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ కాషాయ పార్టీ గెలుపును అడ్డుకోవాలంటే ఇప్పటి నుంచే సమాయాత్తం కావాలని నిర్ణయించాయి. దీనిలో భాగంగానే కాంగ్రెస్ చొరవతో బెంగళూరులో 26 విపక్షాల భేటీ కొనసాగుతోంది. విపక్షాల భేటీలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అవినీతిపరులంతా బెంగళూరులో దుకాణం తెరిచారని కీలక వ్యాఖ్యలు చేశారు. వారి దుకాణంలో కులతత్వం, అవినీతికి గ్యారంటీ లభిస్తుందన్నారు. బెంగళూరులో జరిగే విపక్షాల భేటీని అవినీతి సమ్మేళనం అని వ్యాఖ్యానించారు.

# ఇట్లు.. దాసోజ్ శ్రవణ్



## రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ లేఖ

**టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఉచిత విద్యుత్ పై చేసిన వ్యాఖ్యల మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. తాజాగా బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు.. కాంగ్రెస్ అధిష్ఠానానికి బహిరంగ లేఖ రాశారు.**

### లేఖలో ఏముందంటే..

''తెలంగాణ ప్రజలను అవమానించడం, బాధపెట్టడం, బెదిరించడం, నీచంగా మాట్లాడమని , కించపరిచే పదజాలంతో బాధపెట్టమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, కాంగ్రెస్ పార్టీ హైకమాండ ఏదైనా ప్రత్యేక లైసెన్స్ ఇచ్చారా..?

ఒకవైపు మహిళా విభాగం కార్యదర్శిగా ట్రాన్స్‌జెండర్ మహిళ అపర్ణా రెడ్డిని నియమించినట్లు ఏఐసీసీ చెబుతోంది. అయితే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ మాత్రం తెలంగాణకు చెందిన ట్రాన్స్‌జెండర్లను తన రాజకీయ చర్చల్లోకి లాగి దుర్భాషలాడుతున్నాడు. యాదవులను పేడ పిసుకుంటారని కించపర్చడం, దొమ్మర్లను, వంశరాజులను హేళన చేయడం..మిగతా కులాలను చులకన చేయడం రేవంత్ కు అలవాటుగా మారింది. గొల్ల కురుమలు, బీసీలను, ఎస్సీలను, ఎస్టీ లను ఇలా ఏ కులాన్ని పడితే ఆ కులాన్ని తక్కువ చేసి మాట్లాడుతున్నాడు.

ఇలాంటి బాధ్యతారహితమైన రాజకీయ నాయకుడ్ని సంఘం నుంచి బహిష్కరించాలి. రేవంత్‌రెడ్డి తన అగ్రకుల అహంకారాన్ని బయటపెట్టుకున్నారని యావత్ సమాజం ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. అగ్ర కులస్తుడనే పొగరుతో బీసీ కులస్తులను అవమానపరుస్తున్నాడు. రేవంత్‌రెడ్డి ఓ దుష్టుడు, చరిత్రహీనుడు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 , ఆర్టికల్ 21, భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 504, అలాగే లింగమార్పిడి వ్యక్తుల చట్టంలోని సెక్షన్ 18డి 2109ని రేవంత్ రెడ్డి ఉల్లంగిస్తున్నాడు. పేదలను తూలనాడే ఈ అగ్రకుల ఆధిపత్య అహంకారం ఎందుకు?

తన ఇటీవల అమెరికా పర్యటనలో, 3 ఎకరాల భూమి ఉన్న పేద రైతులకు 3 గంటల కంటే ఎక్కువ కరెంట్ ఇచ్చే అవసరం లేదని ఆయన అర్థంపర్థం లేకుండా మాట్లాడినారు. అయితే ఆయన మూర్ఖపు, అవమానకరమైన వ్యాఖ్యలతో తెలంగాణ రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో కూడా, అతని మూర్ఖత్వం, మతిస్థిమితం లేని ప్రవర్తనను ఖండించారు.

దాన్ని కప్పిపుచ్చుకోవడానికి, 24 గంటల విద్యుత్ గురించి అందులో అవినీతి అంటూ తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించేలా తెలంగాణ ప్రభుత్వంపై బురదజల్లడానికి రేవంత్ తప్పుడు కథనాన్ని ప్రారంభించాడు. అబద్ధాలతో ప్రజల మనసు గెలవలేము అనే విషయం మూర్ఖుడైన రేవంత్ అర్థం చేసుకోలేక పోతున్నాడు.

ట్రాన్స్‌జెండర్ల వర్గాన్ని, వివిధ బీసీ కులాలను అవమానించేలా రేవంత్ మాట్లాడడం ఇది మొదటిసారి కాదు. అంతకుముందు కూడా చాలాసార్లు ఇలాగే మాట్లాడాడు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే , సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎందుకు..రేవంత్ రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడుతుంటే సహిస్తున్నారు..?

రాజకీయ సంస్కృతిని నాశనం చేసే రాబందుగా రేవంత్ రెడ్డి మారిన విషయాన్ని ఏఐసీసీ ఎందుకు గుర్తించడం లేదు? ఎందుకు నియంత్రిచడం లేదు? చిల్లర రాజకీయాల కోసం ప్రతిపక్షాలను, పేద ప్రజలను హీనమైన పదజాలంతో దుర్భాషలాడడం, అందరినీ కించపరచడం భారత జాతీయ కాంగ్రెస్ కొత్త ఆచారమా..? రేవంత్ రెడ్డి చేసిన అవాంఛిత వ్యాఖ్యల వీడియో ఇది. దయచేసి చూడండి. (https://youtu.be/kHU-t4DL2_g)

సీఎం కేసీఆర్ పాలనలో సమాజంలోని ప్రతి వర్గం ఎంతో గౌరవంగా ఉంది. ఎలాంటి కులం, మతం, లింగం విభేదాలు , వివక్షత లేకుండా కేసీఆర్ గౌరవిస్తున్నారు. అన్ని కులాల వారిని మతాలవారిని ప్రోత్సహిస్తూ..వారి అభివృద్ధికి చేయూత ఇస్తున్నాడు. ఇది చూసి కాంగ్రెస్ పార్టీ హైకమాండ నేర్చుకోవాలి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో ప్రాచీ రాథోడ రూత్ జాన్ పాల్ కొయ్యాల వైద్యులుగా నియమించి ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీని గౌరవించారని దయచేసి గమనించండి.

అదే సమయంలో మీ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, మీ పార్టీ చిల్లర రాజకీయాల కోసం ట్రాన్సజెండర్ సమాజాన్ని, దొమ్మర, వంశరాజులు, యాదవులు, గౌడలు మొదలైన వారితో సహా సమాజంలోని ఇతర పేద వర్గాలను అవమానిస్తూ తక్కువ స్థాయికి దిగజార్చుతున్నాడు. రేవంత్ నోటికి అడ్డు అదుపులేదు. అవతలి వ్యక్తులను , వారి వయసును , వారి కులాలను ఏమాత్రం లెక్కచేయకుండా అవమానిస్తున్నాడు.

ఆయనకు ఓ మర్యాద, సభ్యత , సంస్కారం లేదు. ఇలాంటి వ్యక్తి తెలంగాణ రాజకీయాలకు అవమానకరం. పార్టీని దుర్వినియోగం చేయడమే కాకుండా, డబ్బులు వసూల్ చేస్తూ, తన అనుచరుల చేత ఇతర పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలను మొదలైనవారిని బెదిరిస్తున్నాడు. రేవంత్ ఓ మానసిక రోగి.. అతడిని క్వారంటైన్‌లో ఉంచాలి. నేర చరిత్ర ఉన్న వ్యక్తి రేవంత్ రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించి భారత జాతీయ కాంగ్రెస్ తప్పు చేసింది.

ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని భావిస్తే..రేవంత్ ఆకతాయి ప్రవర్తనను కాంగ్రెస్ పార్టీ ఆమోదించకపోతే., ఏ రాజకీయ పార్టీకి నాయకుడిగా ఉండే కనీస అర్హత లేని రేవంత్ రెడ్డిని వెంటనే అధ్యక్ష పదవినుంచి తొలగించి, ట్రాన్స్‌జెండర్లు, వెనుకబడిన తరగతులు,ఇతర వర్గాలకు బేషరతుగా క్షమాపణలు చెప్పే విధంగా చర్యలు చేపట్టాలి.

రేవంత్ తన రాజకీయ ప్రసంగాలలో తోటి మనుష్యులు అనే కనీస ఇంగితం లేకుండా, ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీని, బీసీ కులాలను కించపరిచి, అవమానించేలా మాట్లాడినందుకు చట్ట ప్రకారం తగిన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నేను తగిన పోలీసు అధికారులకు, తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ లకు జాతీయ మానవ హక్కుల సంఘానికి, జాతీయ ఓబీసీ కమిషన్ కు విజ్ఞప్తి చేస్తున్నాను. బాధ్యతారహితమైన రేవంత్ రెడ్డి వంటి రాజకీయ నాయకుడ్ని సంఘం నుంచి బహిష్కరించాలి అని కోరుతున్నాను. అదేవిధంగా అమాయక ప్రజలను పేదలను చట్ట వ్యతిరేకంగా అవమానిస్తూ, వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బదీస్తున్న రేవంత్ పార్లమెంటు సభ్యత్వం కూడా రద్దు చేయాలని విజ్ఞప్తి.

**- తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 18)**



## బీచ్‌లో వింత వస్తువు

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై 18):**

పశ్చిమ ఆస్ట్రేలియాలోని రిమోలో బీచ్‌లో కనిపించిన పురాతన కాలంనాటి వింతవస్తువు కలకలం రేపింది. బీచ్ ఒడ్డుకు కొట్టుకువచ్చిన భారీ పరిమాణంలోని రాగిరంగు లోహం ఏమిటనేది చర్చనీయాంశంగా మారింది.వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఎవరూ దాన్ని ముట్టుకోకుండా వారించారు. ఆ వింతవస్తువు ఆకాశం నుంచి జారి పడిందని, అది యూఎఫ్ఓ అంటూ మొదట్లో ప్రచారం జరిగింది. అది రాకెట్ విడిభాగం కావచ్చునని కొందరు, విమాన భాగం అని కొందరు ఎవరికి తోచింది వారు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం దానికి భద్రత కల్పించిన ఆస్ట్రేలియా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. దానిపై విచారణ జరుపుతున్నట్లు ఆస్ట్రేలియన్ స్పేస్ ఏజెన్సీ ట్విట్టర్ ద్వారా తెలిపింది.

# విస్తారంగా వర్షాలు

## సింగూరుకు వరద

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 18)**

తెలంగాణలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో సింగూరు ప్రాజెకుటలోకి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 18.359 టీఎంసీలుగా ఉంది. ఇన్ ఫ్లో 1050 క్యూ సెక్కులు, ఔట్ ఫ్లో 320 క్యూసెక్కులు ఉందని అధికారులు తెలిపారు. కాగా, గతేడాది ఇదే సమయంలో ప్రాజెక్టులో 21.017 టీఎంసీల నీటి మట్టం ఉండేది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం లేకపోవడంతో ప్రస్తుతం 18.359 టీఎంసీలుగా ఉందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు తెలంగాణ నయాగరా బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న వానలతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి.



**తస్మాత్ జాగ్రత్త**

ఒడిశా, జార్కండ్ తీరాల్లో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని వల్ల తెలంగాణలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రజలకు రెడ్ వార్నింగ్ ఇస్తున్న కేంద్ర చీఫ్ నాగరత్న తెలిపారు. మరోవైపు, వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. అధికారులు రంగంలోకి దిగారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. డీఆర్ఎఫ్ బృందాలు కూడా అవసరమైతే రంగంలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నాయి.



## పొంగులేటి సోదరుడి భూకబ్జా?

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 18)**

కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు భూ కబ్జాకు పాల్పడినట్టు వెలుగులోకి వచ్చింది. ఖమ్మం శివారులో పొంగులేటి సోదరుడు ప్రసాద్‌రెడ్డికి చెందిన 'ఎస్ఆర్ గార్డెన్స్'లో ఉన్న 21.50 గుంటల భూమి 'ఇరిగేషన్ స్థలం' అని ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు తేల్చారు. ఖమ్మం అర్బన్ తహసీల్దార్ మేదరమెట్ల శైలజ పోలీసుల సహాయంతో చేపట్టిన సర్వేలో ఈ విషయం బయటపడింది. కాంగ్రెస్ పార్టీ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి 2022లో సర్వేనంబరు 140లోని 30 కుంటల భూమిని ఓ వ్యక్తి వద్ద కొనుగోలు చేశారని, ఆ భూమికి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇప్పించాలని హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు సదరు పిటిషన్‌ను పరిశీలించి ఎనిమిది వారాల లోపు విచారించి ఎన్వోసీ జారీకి చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్‌శాఖ చీఫ్ ఇంజినీర్‌కు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు ఈ నెల 15న సర్వేకు హాజరు కావాలని ప్రసాద్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. నోటీసు ప్రకారం తాను కొనుగోలు చేసిన భూమికి హద్దులు చూపించేందుకు ఎన్వోసీ కోరిన వ్యక్తే హాజరుకావాల్సి ఉంటుంది.

కానీ ప్రసాద్‌రెడ్డి సర్వేకు గైర్హాజరయ్యారు. పైగా అధికారులు ఇచ్చిన నోటీసుపై హైకోర్టును ఆశ్రయించి అనారోగ్య కారణాలతో సర్వేకు హాజరు కాలేకపోతున్నానని కోర్టు నుంచి లంచ్ మోషన్ తెచ్చుకున్నారు. అధికారులు సర్వేకు హాజరు కావాలని మరోసారి ప్రసాద్‌రెడ్డిని కోరారు. సోమవారమూ సర్వేకు గైర్హాజరయ్యారు. ఆయన తరఫున ఎవరినీ అందుబాటులో ఉంచలేదు. అయితే.. కొందరు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులు సర్వే జరుగుతున్న స్థలం దగ్గరికి వచ్చి వీరంగం సృష్టించారు. పోలీసులు, అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసుల సాయంతో అధికారులు సర్వే కొనసాగించారు.



## సైకోను స్తంభానికి కట్టేసి..

**తెలుగుప్రభ, వరంగల్ (జూలై 18)**

ఓ సైకో వరంగల్‌లో వీరంగం సృష్టించాడు. ఓ ఇంట్లోకి చొరబడి హల్‌చల్ చేశాడు. ఊహించని ఆ పరిణామంతో ఆ కుటుంబ సభ్యులు హడలిపోయారు. అరుపులు కేవలం పెట్టడంతో స్థానికులంతా వచ్చి ఆ సైకో పని పట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. పుప్పాలగుట్టకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంట్లోకి ఓ గుర్తు తెలియని వ్యక్తి రెండు సంచులు చేత పట్టుకొని ప్రవేశించాడు. ఎవరు మీరని ప్రశ్నించడంతో అతడు ఆగ్రహంతో ఇంటి యాజమానిపై రాయితో దాడి చేశాడు. ఇంట్లో వారి అరుపులు విని ఇరుగు పొరుగు వారంతా అక్కడి చేరుకున్నారు. ఎవరు నువ్వని నిలదీయడంతో ఆసీఫ్ అనే మరోవ్యక్తిపై ఆ సైకో దాడికి పాల్పడ్డాడు. అతని మానసిక స్తితి సరిగా లేదనని స్థానికులు గుర్తించారు. చివరికి అతడ్ని పట్టుకుని ఓ స్తంభానికి కట్టేశారు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చిన అతడ్ని తీసుకెళ్లారు.

## కన్నతల్లిని కడతేర్చిన కసాయికి యావజ్జీవం

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై18):**

**కన్నతల్లినే కడతేర్చిన కసాయి కొడుక్కి న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. రెండేళ్ల క్రితం ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బల్కంపేటలో గంజాయి, ఆల్కహాల్‌కి బానిసగా మారిన సంతోష్ అలియాస్ సంతు అడిగిన డబ్బు ఇవ్వలేదనే కోపంతో తల్లి సంగీత(50)ను విచక్షణారహితంగా కత్తితో పొడవడంతో ఆమె ఆక్కడికక్కడే మరణించింది. ప్రాసిక్యూషన్ నేరాన్ని నిరూపించడంతో న్యాయస్థానం సంతోష్‌కు జీవిత ఖైదు, రూ. 10వేల జరిమానా విధించింది. రెండేళ్ల లోనే దోషికి తగిన శిక్ష పడేలా కోర్టుకు ఆధారాలు సమర్పించిన ఎస్ఆర్‌నగర్ పోలీసుల్ని ఉన్నతాధికారులు అభినందించారు.**

## భేటీకి దూరంగా వైసీపీ, టీడీపీ

**తెలుగుప్రభ, అమరావతి (జూలై 18)**

కేంద్ర, రాష్ట్ర రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. బెంగళూరు వేదికగా యూపీఏ పక్షాలు భేటీ అవుతుండగా, మరోవైను ఎన్డీఏ కూడా సమావేశం నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి కొన్నిపార్టీలు వెళ్లకపోవడం చర్చనీయాంశంగా మారింది. అందులో ఏపీకి చెందిన వైసీపీ, టీడీపీ కూడా ఉన్నాయి. రాష్ట్ర ప్రజయోజనాలే లక్ష్యంగా ఏపీ సీఎం జగన్ కేంద్ర పెద్దలతో మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు. అయితే టీడీపీ స్ట్రాటజీపై క్లారిటీ రావాల్సి ఉంది. బీజేపీ, జనసేనతో టీడీపీ పొత్తుపై ఇంకా ఓ స్పష్టత రాలేదు. దీంతో టీడీపీ వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతుందా..? లేక పొత్తులతో ముందుకు వెళుతుందా అన్నది తేలాల్సి ఉంది. మరో వైపు రాష్ట్రానికి బీజేపీ చేసిందేమి లేదన్న భావనలో ఏపీ ప్రజలు ఉన్నారు. ఈ నేపథ్యంలోనే... బీజేపీకి దూరంగా ఉండి సొంతగానే బలం పెంచుకోవాలన్న భావనలో టీడీపీ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.